నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 10: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. **వెబ్‌సైట్ :** cbseitms.rcil.gov.in



ఎక్స్‌కవేటర్‌తో ఎర్రమట్టిని ట్రాక్టర్లలోకి నింపుతున్న దృశ్యం



మేమేం తక్కువ..?

- ఇష్టారాజ్యంగా అధికార పార్టీ నాయకుల ఎర్రమట్టి తవ్వకాలు
- ఆదోనిలో కరిగిపోతున్న కొండాపురం గుట్టలు
- అక్రమంగా తరలిపోతున్న ఎర్రమట్టి
- మామూళ్ల మత్తులో అధికారులు
- కూటమి నేతలపై విమర్శల వెల్లువ

ఆదోని, సెప్టెంబరు 10 :

ఆదోనిలో మట్టి మాఫియా రోజురోజుకూ పెరిగిపోతోంది. కొందరు అధికారులు, అధికార పార్టీ నాయకుల అండదండలతో కొండలను పిండి చేస్తున్నారు. ఆదోని కొండాపురం కొండల్లో, ప్రభుత్వ భూముల్లో మట్టి తరలించుకొనిపోయిన భారీ గుంతలు ఆనవాళ్లుగా కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కొండాపురం కొండల్లో ఉన్న ఎర్రమట్టిని విక్రయించి సొమ్ము చేసుకోగా, మేమేం తక్కువ అన్నట్లు.. ప్రస్తుత అధికార పార్టీ నాయకుల అండదండలతో కపటి గ్రామానికి చెందిన ఓ చోటా నాయకుడు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసుకొని ఎర్రమట్టిని తవ్వి పట్టణానికి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసి, సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ వ్యక్తి నుంచి ప్రతి నెల ఖర్చుల నిమిత్తం కూటమి నాయకుడికి రూ.2.60 లక్షల నగదు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. గతంలో వైసీపీ నాయకులు ఎర్రమట్టి తవ్వుకొని సొమ్ము చేసుకున్నారని, వాళ్లకంటే తాము ఏం తక్కువని ప్రస్తుత కూటమి నాయకులు అంటున్నారు.

ఆదోనిలో కొండలను గుల్ల చేస్తున్నారు. కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. అక్రమార్కులు కొండలను కొల్లగొట్టడంతో పర్యావరణ సమస్య కూడా తలెత్తే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మట్టి దందాను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ అండదండలతో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా దందా కొనసాగిస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న ఒక నాయకుడికి నెలకు రూ.2.60 లక్షలు ఇవ్వాల్సి ఉందని, దీనికి గాను ఎక్కడైనా తవ్వుకోవచ్చని చెప్పారనే మాటలు వింటుంటే గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తేడా ఏమిటనే ప్రశ్న తలెత్తుతోందని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కేవలం ఎర్రమట్టి మాత్రమే కాక ఇసుక, మధ్యాహ్న భోజన పథకంలో గుడ్లు కూడా ఆదోనిలో పంచుకు తింటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అధికార పార్టీలో కీలకంగా ఉన్న ఓ నాయకురాలు ఆదేశాలతో ఆదోని మండలంలోని ఎస్ కొండాపురం గ్రామ పంచాయతీలోని కొండలు, గుట్టలను ఇష్టానుసారంగా తవ్వుకొని ఎర్రమట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనివల్ల సహజ వనరులు అక్రమంగా తరలిపోవడమే కాకుండా, ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన సొమ్ము కూడా అందకుండా పోతోంది. అంతేకాకుండా ఆదోని చుట్టుపక్కల ఉన్న కొండలు, గుట్టలు ప్రాంతంలో ఎర్రమట్టిని కూడా అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. కొండాపురం కొండలను పిండి చేసినా, ఇంతవరకు అధికారులు పట్టించుకోకపోవడానికి కారణమమేటో అర్థం కావడం లేదు. కూటమి ప్రభుత్వంలో ముఖ్య నాయకుడి ఆదేశాలు ఉండటంతోనే అటువైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదని సమాచారం. ఎర్రమట్టి ఒక ట్రాక్టర్ దూరాన్ని రూ.1,000 నుంచి రూ.20,000 వరకు, అదే టిప్పర్ దూరాన్ని బట్టి రూ.3,000 నుండి రూ.5,000 వరకు విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతిరోజూ రూ.లక్షల్లో ఎర్రమట్టి అక్రమాలు జరుగుతున్నా, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు ఇంతవరకు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం గమనర్హం.



ఎర్రమట్టిని ట్రాక్టర్లలోకి నింపుతున్న దృశ్యం

అప్పుడు వైసీపీ వాళ్లు తిన్నారు... ఇప్పుడు మేము తింటాం...

గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కొండలను పూర్తిగా తవ్వి అందిన కాడికి దోచుకున్నారని, ఇప్పుడు తమ ప్రభుత్వంలో తాము ఎర్రమట్టి తరలించుకుంటే తప్పేమిటనే వాదన కూటమి పార్టీల నాయకుల నుంచి వినిపిస్తోంది. కావాలంటే డబ్బు ఇస్తాను.. నీవైనా తీసుకో.. మీ పేపర్‌కైనా యాడ్ వేసుకో అంటూ సెలవిచ్చారు.

ఈ విషయంపై తహసీల్దార్ శివరాముడును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఎవరైనా ఎర్రమట్టిని తరలించినట్లు తెలిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. ప్రైవేట్ స్థలంలో ఎర్రమట్టిని తరలిస్తున్నారని సమాచారం తెలిస్తే కేసులు నమోదు చేస్తామని, ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని అన్నారు.



కొండను తవ్వి ఎర్రమట్టిని దోచుకున్న దృశ్యం

● వాల్టా చట్టానికి తూట్లు....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహజ వనరులు తరలిపోకుండా ఉండేందుకు 2004లో తీసుకొచ్చిన వాల్టా (వాటర్, ల్యాండ్, ట్రీస్) చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ మాటలన్నీ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం సొంత భూమిలో సైతం సహజ వనరులైన ఎర్రమట్టి తవ్వాలన్నా, నీటి కోసం బోర్లు వేయాలన్నా, సొంత పొలంలో ఉన్న చెట్లును తొలగించాలన్నా రెవెన్యూ, మైనింగ్, అండర్ గ్రౌండ్ వాటర్ రిసోర్స్ డిపార్ట్మెంట్ అధికారుల అనుమతులు తీసుకోవాలి. అక్రమ ధనార్జనకు అలవాటు పడిన కూటమి ప్రభుత్వంలో ఉన్న కొంతమంది స్వార్థపరులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ సహజ వనరులను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు మాత్రం మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు స్థానికంగా ఉండే అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులు ఒత్తిళ్లకు లొంగి, చూసీచూడనట్లు వివరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఉల్లినారుకు భలే గిరాకీ

● ఒక్కసారిగా పెరిగిన ధర ● ఒక మడి రూ.3 వేలు

గోనెగండ్ల, సెప్టెంబరు 10: ఒక్క సారిగా ఉల్లి నారు ధర ఆకాశాన్ని అంటింది. నిన్న మొన్నటి వరకు ఉల్లి నారు వైపు కన్నెత్తి చూడని రైతులు గత నెలరోజులుగా అడపదడపా వర్షాలు కురియడం, మార్కెట్‌లో ఉల్లి ధర పెరుగుతుండటంతో రైతులు ఉల్లి పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఉల్లినారు సాగు చేసిన రైతులు అమాంతంగా ఉల్లినారు రేటు పెంచేశారు. ఒక బెడ్(మడి) ధర రూ. 3000 పలుకుతోంది. ఒక ఎకరంలో ఉల్లినారు సాగుకు రూ. 1.50లక్ష ఖర్చు అవుతుంది. ఉల్లి విత్తనాల రేటు కూడా కిలో రూ. 150 నుంచి రూ. 600 వరకు పెరిగింది. ఒక ఎకరంకు 200 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. ఒక ఎకరంలో 190 నుంచి 200 వరకు ఉల్లినార బెడ్లు పడతాయి. ఒక ఎకరంలో ఉల్లిపంటను సాగు చేసేందుకు 6 నుంచి 8 బెడ్లనారు కావాలి. అయితే గత కొన్ని రోజులుగా ఉల్లికి ధర లేక పోవడంతో ఉల్లి నారు సాగు పట్ల రైతులు మక్కువ చూపలేదు. ఇప్పటికి మండలంలో దాదాపు 100 ఎకరాల్లో మాత్రమే ఉల్లి నారు సాగు చేశారు.



ఉల్లి పంట సాగుకు సిద్ధంగా ఉన్న ఉల్లి నారు

పెరిగిన పత్తి ధరలు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 10 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గత వారం రోజుల్లో పత్తి ధరలు పుంజుకున్నాయి. మంగళవారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.8239 పలికింది. గత వారంతో పోల్చితే పత్తి ధర క్వింటానికి రూ. 200పైగా ధర పెరిగింది. ఏడాది తర్వాత ధరలు మళ్లీ పెరుగుతుండడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ దిగుబడులు చేతికొచ్చే వరకు ధరలు ఇలాగే కొనసాగాలని రైతులు కోరుతున్నారు. 1055 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4319 గరిష్ఠ ధర రూ.8239, మధ్యస్థధర రూ.7499 పలికింది.

వరద బాధితులకు అండగా...

పదివేల కిట్లతో విజయవాడకు తరలిన లారీలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్, టీడీపీ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: వరద బాధితుల కోసం జిల్లా టీడీపీ నేతలు స్పందించారు. రూ.1.50 కోట్లు విలువ చేసే పదివేల నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను సమకూర్చారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి విజయవాడకు బయలుదేరిన ఆరు లారీలకు కలెక్టర్ పి. రంజిత్ బాషా, ఎస్పీ జి.బిందుమాధవ్‌లు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు స్పందించి విజయవాడలోని వరద బాధితుల కోసం భారీగా నిత్యావసర వస్తువులను పంపించడం అభినందనీయమన్నారు. ఒక్కో కిట్టులో కుటుంబానికి 10 రోజులకు సరిపడా బియ్యం, కందిపప్పు, చక్కెర, ఆయిల్ ప్యాకెట్ తదితర సరుకులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, ఆదోని, ఆలూరు టీడీపీ నాయకులు కె.మీనాక్షి నాయుడు, వీరభద్ర గౌడ్, నాయకులు ఆకెపోగు ప్రభాకర్, సోమిశెట్టి నవీన్, నంద్యాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి 2 వేల విగ్రహాలు

ఎస్పీ జి.బిందు మాధవ్



మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు, సెప్టెంబరు 10: కర్నూలు నగర వ్యాప్తంగా రెండువేల వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. సోదరభావంతో శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలను ముగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఈ నెల 15న వినాయక నిమజ్జనం, 16న మిలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకుని మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు జిల్లా మతసామరస్యంలో ఆదర్శంగా, స్ఫూర్తిగా ఉండాలన్నారు. సంప్రదాయాలను గౌరవిస్తూ ఇతరుల మనోభావాలకు భంగం కలిగించరాదన్నారు. 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. నిమజ్జన వేడుకల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. పారిశుధ్యం కోసం 480 మంది శానిటరీ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మద్యం షాపులు, బార్లు బంద్ చేయించాలని కోరారు. 16న మిలాద్ నబీ పండుగ ఉందని ఆయా ప్రాంతాల నుంచి ర్యాలీలు ఉంటాయనీ మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని ముస్లిం మతపెద్దలు కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు ప్రసాద్, కేశవరెడ్డి, పవన్ కిషోర్, రామయ్య నాయుడు, నాగరాజరావు, మురళీధర్ రెడ్డి, మధుసూదన్‌గౌడు, మన్సూరుద్దీన్, శ్రీధర్, మత పెద్దలు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ సలాం, మౌలానా అబ్దుల్ ఖదీర్, ప్రతాప్ రెడ్డి, పూల రంగస్వామి, మహ్మద్ పీరా, పర్వేజ్, మద్దిలేటి, వేణుగోపాల్ జోగయ్య శర్మ, అబ్దుల్ రజాక్, అధికారులు పాల్గొన్నారు.

అత్యాధునిక క్రస్ట్ గేట్లు తప్పనిసరి

కర్నూలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయడం మంచిది కాదు. మరో క్రస్ట్‌గేటు కొట్టుకుపోదని గ్యారెంటీ ఇవ్వలేం. అత్యాధునిక డిజైన్‌తో 33 క్రస్ట్‌గేట్లు కొత్తగా ఏర్పాటు చేయడమే అంతిమ పరిష్కారం..' అని ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సెక్రెటరి ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డిలకు మంగళవారం ప్రాథమిక నివేదిక అందజేశారు. డ్యాం గేట్ల అధ్యయనంలో గుర్తించిన అంశాలతో సమగ్ర నివేదిక మూడు రోజుల్లో అందజేస్తామని కమిటీ చైర్మన్ ఏకే బజాజ్ బోర్డు అధికారులకు చెప్పినట్లు సమాచారం. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటుగా కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం. స్వాతంత్ర్యం రాకముందే 1945లో అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చేపట్టిన ఈ ప్రాజెక్టు 1953లో పూర్తయింది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రాజెక్టుగా 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా మారింది. తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. మూడు రాష్ట్రాలకు 70 ఏళ్లుగా సాగు, తాగునీరు అందిస్తోంది. డ్యాం ప్రారంభం నుంచి క్రస్ట్‌గేట్లు సమస్య తలెత్తలేదు. తొలిసారిగా ఆగస్టు 10న ఎత్తిన గేట్లు దించుతుండగా 19వ నంబరు గేటు చైన్‌లింక్ తెగిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తక్షణమే ఏపీ, కర్నాటక ప్రభుత్వాలు అప్రమత్తం కావడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ సెగ్మెంట్లు దిగ్విజయంగా అమర్చి వరద కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. ఇదే సమయంలో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. టీబీపీ బోర్డు సూచన మేరకు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ చైర్మన్‌గా, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఢిల్లీకి చెందిన హర్కేశ్‌కుమార్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ రాష్ట్రం సీడీవో ఈఈ బాలమురళికృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డు ఎస్‌ఈ సుధాకర్, కర్నాటక రాష్ట్రం టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రిటైర్డు సెక్రటరీ సిద్ధరంగప్ప సభ్యులుగా ఉన్న నిపుణుల కమిటీ సోమ, మంగళవారం రెండు రోజులు డ్యాంతో పాటు క్రస్ట్‌గేట్లను తనిఖీ చేశారు.



పరిశీలిస్తున్న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు

ఆ గుంత వల్ల డ్యాంకు ప్రమాదం

శ్రీశైలం ప్రాజెక్టుకు ప్లంజ్‌పూల్ గుంత వల్ల ఎలాంటి ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారో.. తుంగభద్ర డ్యాంకు కూడా ఓ భారీ గుంత(పూల్) వల్ల ప్రమాదం పొంచి ఉందని నిపుణులు గుర్తించారు. డ్యాం బయట వైపున 22వ నంబరు గేటు దిగువన 40 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. దీని వల్ల డ్యాం పునాదులకు ప్రమాదం పొంచి ఉందని గతంలోనే నిపుణులు పలుమార్లు హెచ్చరించారు. డ్యాం లెఫ్ట్ బ్యాంక్ (మునిరాబాద్ వైపు) ఆనకట్టకు 100 మీటర్ల దూరంలో పార్కులో బోటింగ్ కోసం సరస్సు ఏర్పాటు చేశారు. ఈ సరస్సులోకి నీళ్లు మళ్లించేందుకు లెఫ్ట్ కెనాల్‌కు తూములు కూడా ఏర్పాటు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. అయితే ఈ సరస్సులోకి డ్యాం నుంచి లీకేజీ అవుతుండడంతో దీని వల్ల కూడా ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ రెండింటిని పూడ్చివేత కోసం బోర్డు ఇంజనీర్లు డ్యాం రిహ్యాబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) కింద కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం ఇవ్వలేదు. వీటి వల్ల డ్యాంకు ఎలాంటి ప్రమాదం పొంచి ఉందని బోర్డు అధికారులు నిపుణుల కమిటీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిని తనిఖీ చేయించారు. అయితే ఈ గుంతల వల్ల డ్యాంకు ప్రమాదం ఉన్నమాట నిజమే అయినా తాము ప్రస్తుతం క్రస్ట్‌గేట్లు, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీపైనే అధ్యయనం చేసి నివేదిక ఇస్తామని నిపుణుల కమిటీ సూచించినట్లు తెలిసింది.

- గేట్లపై ఒత్తిడి తగ్గేలా 1,632 అడుగుల లెవల్‌లో నీటి నిల్వ
- స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌పై అధ్యయనం అవసరం
- 22వ గేటు వద్ద గుంత వల్ల డ్యాంకు ప్రమాదం
- తుంగభద్రపై నిపుణుల కమిటీ ప్రాథమిక అంచనా
- మూడు రోజుల్లో సమగ్ర వివరాలతో బోర్డుకు నివేదిక

కీలక అంశాలతో నివేదిక

తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్‌గేట్లు జీవితకాలం తీరడంతో వాటి స్థానంలో అత్యాధునిక డిజైన్‌తో కొత్తగేట్లు ఏర్పాటు చేయాలని ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ప్రధానంగా అభిప్రాయపడింది. గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటుపై నిపుణులతో అధ్యయనం చేయించాలి. మూడు రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు సంరక్షించే భారీ ప్రాజెక్టు కావడంతో జలాశయం పటిష్ఠత (డ్యాం హెల్త్ కండీషన్)పై పూర్తిస్థాయిలో సంబంధిత నిపుణులతో స్టడీ చేయించాలి. క్రస్ట్‌గేట్లు దిగువ భాగం దాదాపు 9 నెలలకు పైగానే నీటిలో ఉండడంతో వాటి అరుగుదలపై కూడా పరిశీలించాల్సి ఉందని ఈ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. గతంలో 1,632 అడుగుల లెవల్‌లో నీటిని నిల్వ చేసేవారు. ఆ తరువాత గరిష్ఠ లెవల్ 1,633 అడుగుల వరకు నీటి నిల్వ చేయడం వల్ల గేట్లపై ఒత్తిడి పెరుగుతుంది. 1,632 అడుగుల లెవల్‌లోనే నీటిని నిల్వ చేయాలని కమిటీ సూచించింది. గేట్లు కనీసం 2.5 అడుగులు ఎత్తాలని, ఒక అడుగు, అర అడుగు ఎత్తడం వల్ల నీటి ప్రవాహ వేగం, ఒత్తిడికి గేట్లు దిగువన డ్యాం బయటి వైపు గుంతలు పడి డ్యాం పునాదులకే ముప్పు పొంచి ఉంటుందని సూచించారు. ఇక నుంచి గేట్లు ఎత్తాల్సి వస్తే.. కనీసం 2.5 అడుగులు ఎత్తాలని సూచించారు. అలాగే ఈ డ్యాంకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ లేవు. దీంతో సాంకేతిక సమస్యలతో ఏదైనా గేటు కొట్టుకుపోతే క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల వరకు డ్యాం ఖాళీ చేయాల్సి వస్తుంది. ఈ సమస్య తలెత్తకుండా థర్డ్‌పార్టీ నిపుణులతో స్టాప్‌లాగ్ ఏర్పాటుపై అధ్యయనం చేయించి వాళ్లు ఇచ్చే నివేదిక మేరకు ముందుకు వెళ్లాలి. ఇలా పలు సూచనలతో ఏకే బజాజ్ నాయకత్వంలోని నిపుణుల కమిటీ టీబీపీ బోర్డు అధికారులకు ప్రాథమిక నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్



కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: గతంలో వైరల్ జ్వరాలు మందులు వేసుకున్నా, లేకున్నా 3 నుంచి 4 రోజుల్లో తగ్గిపోయేవి. ప్రస్తుతం వస్తున్న వైరల్ జ్వరాలు ఏ మాత్రం తగ్గడం లేదు. 7 నుంచి 10 రోజులపాటు జ్వరం ఉంటున్నది. 104 డిగ్రీల జ్వరం వచ్చి ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బందిపడుతున్నారు. దీని వల్ల సీఆర్పీ (సీరియాక్టివ్ ప్రొటీన్) త్వరగా పెరుగుతుంది. జ్వరంతో పాటు ప్లేట్‌లెట్ల సంఖ్య వేగంగా పడిపోతుంది. డెంగీ కేసులు అనుమానితమైనవే అధికంగా ఉన్నాయి. వారం రోజులుగా కర్నూలు జీజీహెచ్‌లో 10 డెంగీ కేసులు ఉన్నాయి. లక్షల్లో ఉండాల్సిన ప్లేట్‌లెట్ల కౌంట్ల సంఖ్య వేలల్లో ఉంటుంది. చాలా మందికి రక్తంలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉన్నాయి. వెంటనే ఎక్కించాలని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రోగులకు దోపిడీ చేస్తున్నాయి. ఇక మురికివాడలా రోగులు ఆర్థిక భారంతో ప్రైవేటు ఆసుపత్రులకు ఎక్కువగా క్యూ కడుతున్నారు.

పరీక్షలు తప్పవా...?

వైరల్ జ్వరం వచ్చిన వారు తప్పనిసరిగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలను వైద్యులు తప్పనిసరిగా రాయిస్తున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లో రోగులను దోపిడీ చేస్తున్నారు. దీంతో నిరుపేదలు వీటి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. పీహెచ్‌సీలో ఈ పరీక్షలన్నీ సరిగ్గా అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు.



జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణ మార్పులతో జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపాలు మొదలైన కారణాల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రైవేటు హాస్పిటళ్లకు రోగులు పరుగులు తీస్తున్నారు. చాలా ఇండ్లలో చిన్నారుల నుంచి పెద్దల వరకు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, నొప్పులతో రోగులు అల్లాడిపోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా డయోగ్నస్టిక్ సెంటర్ల వద్ద రద్దీ పెరిగింది. వైరస్ కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని గుర్తించినా వ్యాధికారక వైరస్ ఏమిటో తెలియడం లేదు.

రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



మెడికల్ ఓపీని చూస్తున్న వైద్యులు



ప్రమాదకరంగా డెంగీ

జిల్లాలో డెంగీ కేసులు అధికంగా ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 221 కేసులు నమోదు కాగా, ఇందులో కర్నూలు అర్బన్‌లో 65 డెంగీ పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. శరీన్‌నగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, బుధవారపేట, ముజఫర్‌నగర్ వంటి స్లమ్ ఏరియాలో డెంగీ అధికంగా ఉంది. ఇక కర్నూలు మండలంలో 16, దేవనకొండల 15, ఉలిందకొండలో 14, సి.బెళగల్‌లో 13, నందవరంలో 10, కల్లూరులో 7, ఆస్పరిలో రక్తపూతల పరీక్షలు 2.80 లక్షలు మంది నిర్వహించగా... 8 మందికి వ్యాధి నిర్ధారణ అయింది.

వైరల్ ఫీవర్‌లే ఎక్కువ



కొద్ది రోజులుగా ఆసుపత్రికి వైరల్ ఫీవర్ కేసులు అధికంగా వస్తున్నాయి. వాతావరణంలో మార్పులు వర్షాల వల్ల జ్వరంతో పాటు జలుబు, కీళ్ల నొప్పుల లక్షణాలు ఉంటున్నాయి. కానీ వైరల్ ఫీవర్ పట్ల భయపడాల్సిన అవసరం లేదు. జ్వరం ఉన్న చాలా కేసులు అడ్మిట్ చేసుకోవడం లేదు. మంగళవారం మెడికల్ ఓపీకి 400 మంది రాగా ఇందులో 30 మంది అడ్మిట్ అయ్యారు. వీటిలో 20 కేసులు వైరల్ ఫీవర్ కేసులే ఉన్నాయి. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డా. లక్ష్మీబాయి, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ కర్నూలు సర్వజన వైద్యశాల

నెల రోజులుగా బాధపడుతున్నా



జ్వరం, కాళ్ల నొప్పులు, వాపులతో ఉదయం మెడికల్ ఓపీకి వచ్చారు. నెల రోజులైనా కాళ్ల నొప్పులు, వాపులు తగ్గడం లేదు. ఇప్పటికే పెద్దాసుపత్రికి ఐదుసార్లు తిరిగాను. చికెన్ గున్యా అంటూ మందులు వాడినా తగ్గడం లేదు.

- బాలన్న, డోన్ మండలం కనపకుంట

జ్వరం తగ్గడం లేదు



నెల రోజుల నుంచి ఆసుపత్రికి తిరుగుతున్నా ఏ మాత్రం జ్వరం తగ్గడం లేదు. సరిగ్గా ఆకలి కావడం లేదు. ఇన్ని రోజులు ఎప్పుడూ జ్వరం ఉండలేదు. ఆసుపత్రిలో మందులు వేసుకున్నా అవి సరిగా పని చేయడం లేదు.

- ఫిరోజ్ ఖాన్, రోగి

వరద సాయంగా రూ. 10 లక్షలు

సీఎంకు అందించిన ఎంపీ బస్తిపాటి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముందుకు వచ్చారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రూ. 10 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అండగా నిలిచిన ఎంపీని సీఎం చంద్రబాబు అభినందించారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తోచిన సాయం అందించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు.



సీఎంను కలిసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఎమ్మెల్యే బీవీ రూ.10 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు : వరద బాధితుల సహాయార్థం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి రూ.10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. మంగళవారం వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి మూడు నెలల వేతనంతో పాటు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు సేకరించిన రూ.5 లక్షలను సీఎం సహాయ నిధికి చెల్లించారు.

టీడీపీ నేత వహీద్ రూ.3.6 లక్షలు

నంద్యాల కల్చరల్ : విజయవాడ వరద బాధితులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్ అండగా నిలిచారు. తనవంతు సహాయం రూ.3.6 లక్షల చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు మంగళవారం అందజేశారు. వరదబాధిత ప్రాంతాల్లో ఆయన పర్యటిస్తూ పలు సేవా కార్యక్రమాలతో పాటు దుస్తులను కూడా పంపిణీ చేశారు.



చెక్కును అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్

లా సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో లా 5,7,9 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉస్మానియా కళాశాలలో ఏర్పాట్లను ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎస్. వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రెండు సెషన్స్‌లో జరుగుతాయని ప్రతి విద్యార్థి పరీక్షల నిబంధనలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఉదయం 307 మంది హాజరుకాగా, 13మంది, మధ్యాహ్నం 56 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు.

కుందూనదిలో వైద్య మందులు!

నీరు కలుషితమయ్యే ప్రమాదం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 10: మండలంలోని రూపనగడి గ్రామ కుందూనది వంతెన సమీపంలో వైద్య మందులు, సూదులు, ట్యాబ్లెట్లు, అట్టపెట్టలు భారీగా ప్రత్యక్షమయ్యాయి. మంగళవారం కుందూనదిలోకి వెళ్లే రస్తాలో మందులు కనిపించాయి. మండలంలో ఉయ్యాలవాడ, మాయలూరు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో ప్రాథమిక వైద్యశాలలు ఉండగా, ఆయా గ్రామల్లో దాదాపుగా పది మంది ఆర్ఎంపీలు ఉన్నారు. నదిలో పడేసిన మందులను ప్రభుత్వ సిబ్బంది పడవేశారా? లేక ఆర్ఎంపీలు వేశారా? అన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే కాలం చెల్లిన మందులను ఇలా వేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై వైద్యాధికారి వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



నీళ్లలో తేలియాడుతున్న ట్యాబ్లెట్లు, టానిక్ సీసాలు, అట్టపెట్టెలు

విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచడంలో ప్రభుత్వం విఫలం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు సామర్థ్యం పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కార్మిక, రైతు సంఘాల నాయకులు విమర్శించారు. విశాఖపట్టణం ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన రాస్తారోకో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐకేఎస్, ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో రాజవిహార్ కూడలిలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి రాజవిహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన రాస్తారోకోకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. అంజిబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి. శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన పోరాటంలో 32 మంది అమరవీరుల బలిదానంతో ఏర్పాటైన ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. మూడు సంవత్సరాలుగా ఉద్యమం నడుస్తున్న కూడ కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశంతో ఆదానికి అప్పజెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బి. వెంకటేష్, టి.రామాంజనేయులు, కిట్టు, పురుషోత్తం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో



ర్యాలీగా వస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

● ట్రాఫిక్ సమస్య.. ఏఐటీయూసీ, సీఐటీయూ అధ్వర్యంలో రాజ్‌విహార్‌లో నిర్వహించిన రాస్తారోకోలో భాగంగా అరగంట సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కొత్తబస్టాండు నుంచి నందికొట్కూరు, నంద్యాల వెళ్లే ఆర్టీసీ బస్సులను బళ్లారి చౌరస్తా మీదుగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ



జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటున్న మురళీ కృష్ణ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషాతో పాటు నూతన జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీకి పునాదిలాంటి వారన్నారు. ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో సీనియర్లు, జూనియర్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను అందరిని కలుపుకుని పని చేస్తానన్నారు. ఈ నెలలోనే డీసీసీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. అంతకుముందు సీక్యాంప్ సెంటర్‌లోని దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి, రాజ్‌విహార్ సెంటర్‌లోని ఇందిరా గాంధీ, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, కోట్ల విజయభాస్కరరెడ్డి, అంబేడ్కర్, దామోదరం సంజీవయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, మాజీ డీసీసీ అధ్యక్షుడు బాబురావు, పీజీ నరసింహులు యాదవ్, బజారన్న, ప్రమీల, వెంకట సుజాత తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటపై గడ్డి మందు పిచికారి

ఏడుగురిపై కేసు నమోదు

రుద్రవరం, సెప్టెంబరు 10: మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన పోలుబోయిన వెంకటక్రిష్ణ అనే రైతు సుమారు నాలుగు ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. సోమవారం అర్ధరాత్రి మినుము పంటపై అదే గ్రామానికి చెందిన బీరం వెంకటేశ్వరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, వెంకట శ్యాంసుందర్రెడ్డి, వెంకట ప్రశాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, గౌతంరెడ్డి, చిన్నవెంకటరెడ్డి అనే వ్యక్తులు గడ్డి మందు పిచికారి చేశారని మంగళవారం బాధిత రైతు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పై ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

పారా మెడికల్ రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: పారా మెడికల్ కోర్సులకు 2024-25 విద్యాసంవత్సరానికి రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ పారా మెడికల్ కోర్సులలో మిగిలిన సీట్లకు మెరిట్, రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే ఆ సీట్లను ఈ నెల 17న జరిగే మూడో కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అనిల్ కుమార్ రెడ్డి, ఏవో లక్ష్మీ ప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: కర్నూలు జిల్లాకు సంబంధించి రూ.15,068.46 కోట్లతో కూడిన 2024-25 వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఖరీఫ్‌లో రూ.2,873.96 కోట్లు, రబీలో రూ.1,997.16 కోట్లు, అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ రూ.2,318.18 కోట్లు, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.88.03 కోట్లు కలిపి మొత్తం వ్యవసాయ రంగానికి రూ.7,746.84 కోట్లుగా ప్లాన్ రూపొందించారు. అదేవిధంగా సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థలకు రూ.2,560.77 కోట్లు, విద్యారంగానికి రూ.198.26 కోట్లు, హౌసింగ్‌కు రూ.913.99 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ.39.65 కోట్లు, పునరుత్పాదక శక్తికి రూ.32.01 కోట్లు, ఇతర రంగాలకు రూ.636.7 కోట్లు మొత్తం కలిపి ప్రాధాన్యతా రంగాలకు రూ.12,128.22 కోట్లు కేటాయించారు. ఇక ఇతర రంగాలకు రూ.2,940.24 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు వాయిదా

కల్లూరు, సెప్టెంబరు 10: విద్యుత్‌శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరి షెడ్ల(ఎస్‌పీఎం) టెండర్లను వాయిదా వేసినట్లు ఎస్ఈ యం.ఉమాపతి మంగళవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరీ షెడ్లకు సంబంధించిన ఈ-టెండర్ నోటిఫికేషన్ ఈనెల 2వ తేదీన ఇవ్వగా 19న టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. పలు అనివార్య కారణాల వల్ల టెండర్లను వాయిదా వేసినట్లు ఎస్ఈ వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 11 ఎస్‌పీఎం షెడ్లు ఉండగా అందులో 8 ప్రైవేట్, 3 విద్యుత్‌శాఖకు చెందినవిగా ఉన్నాయి.

ఐకార్‌లో మెరిసిన డోన్ విద్యార్థిని త్రిలేఖ

ఆలిండియాలో ఫస్ట్ ర్యాంకు



డోన్, సెప్టెంబరు 10: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) ఎంట్రెన్స్ పరీక్షలో డోన్ విద్యార్థిని దుర్గం త్రిలేఖ మెరిసారు. ఆలిండియా లెవల్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో మొదటి ర్యాంకు సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటారు. డోన్ మండలంలోని జగదుర్తి గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి, అరుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు త్రిలేఖ మహానంది వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు. 10వ తరగతి చదివే సమయంలోనే తండ్రి లక్ష్మీకాంతరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తల్లి అరుణ ప్రోత్సాహంతో త్రిలేఖ చదువులో పట్టుదలతో రాణించారు. బెంగుళూరు జీకేవీకే కళాశాలలో ఎంఎస్సీ సెరికల్చర్ పూర్తి చేశారు. మంగళవారం విడుదలైన ఐకార్ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో త్రిలేఖ ఆలిండియా లెవెల్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో నెంబర్ వన్ ర్యాంకును త్రిలేఖ సాధించారు.

నాలుగేళ్ల బాలికకు డెంగీ

తెర్నెకల్‌లో కేసు నమోదు

దేవనకొండ, సెప్టెంబర్10: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో నాలుగు సంవత్సరాల బాలికకు డెంగీ సోకినట్లు జిల్లా అసిసెట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. వ్యాధి వచ్చిన బాలిక ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్, ఇంటింటికి తిరిగి లార్వా చేయించారు. అలాగే 50 ఇళ్ల లోపల కూడా స్ప్రేయింగ్ చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. దేవనకొండలోని కేజీబీవీ స్కూల్‌ను సందర్శించి పిల్లల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరం వచ్చిన వెంటనే పిల్లలకు రక్త పరీక్షలు చేయించాలని, అక్కడ ఉన్న హెచ్‌ఎం, ఏఎన్‌ఎంలకు తెలియజేశారు. పిల్లల ఆరోగ్యం పట్ల అశ్రద్ధవహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ సభ్యురాలిపై హత్యాయత్నం

కత్తితో పొడిచిన వైసీపీ నాయకుడు కురువ మల్లయ్య

కోసిగి, సెప్టెంబరు 10: కోసిగి వైసీపీలో రాజకీయ ముసలం రాజుకుంది. ఒకే పార్టీలో కొనసాగుతూ హత్యా రాజకీయాలకు తెరలేపారు. వైసీపీ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ దలవాయి మంగమ్మపై అదే పార్టీకి చెందిన కురువ మల్లయ్య కత్తితో దాడి చేశాడు. మంగళవారం కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి సమీపంలో ఉన్న తన ఇంట్లో స్నేహితురాలు ఈరమ్మ, ఆమె మనుమడుతో కలిసి మంగమ్మ ఉన్నారు. ఆ సందర్భంగా వైసీపీ నాయకుడు కురువ మల్లయ్య ఆస్తి తగాదాల్లో ఒకరిపై ఒకరు వాదోపవాదాలు చేసుకొని సహనం కోల్పోయి వెంట తెచ్చుకున్న కత్తితో మంగమ్మ కడుపులో పొడిచారు. ఆమె రక్తస్రావమై కుప్పకూలిపోయారు. కోసిగి పోలీస్‌స్టేషన్‌లో కురువ మల్లయ్యపై ఫిర్యాదు చేసి చికిత్స కోసం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దలవాయి మంగమ్మ, కురువ మల్లయ్య గత ఐదేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నారు. దలవాయి మంగమ్మ మాట్లాడుతూ ఆస్తి విషయమై కురువ మల్లయ్య కత్తితో పొడిచాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.



తీవ్ర రక్తగాయాలతో మంగమ్మ

బాలుడి శవం లభ్యం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10: అహోబిలం గణేష్ నిమజ్జనం సందర్భంగా తెలుగుగంగలో గల్లంతైన బాలుడు లాల్‌బాషా (12) శవం మంగళవారం లభ్యమైంది. తెలుగుగంగలో గల్లంతైన బాలుడు అహోబిలం గ్రామం నుంచి బాచేపల్లెకు వెళ్లే రహదారి వంతెన వద్ద కంపచెట్లలో లభ్యమైందని పోలీసులు చెప్పారు. బాలుని శవాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కర్నూలు, సెప్టెంబరు 10: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని గార్గేయపురం సమీపంలో విక్రమ్ కుమార్ (23) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన విక్రమ్ కుమార్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య పుట్టినిల్లు పగిడ్యాల. భార్య డెలివరీ కావడంతో ఉల్చాల నుంచి మోటారు సైకిల్‌పై సోమవారం మధ్యాహ్నం బయలుదేరాడు. గార్గేయపురం వద్ద బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయన స్థానికులు, పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తండ్రి జోతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

గంగమ్మ ఒడికి గణనాథులు


విగ్రహాల ఊరేగింపులో యువత కేరింతలు

ఓర్వకల్లు, సెప్టెంబరు 10: గత నాలుగు రోజులుగా భక్తులతో పూజలందుకున్న గణనాథులు మంగళవారం సాయంత్రం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మంగళవారం మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం గ్రామాల్లో వినాయకుని నిమజ్జనం వైభవంగా జరిగింది. గణేశ్ మండ పాల వద్ద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. హుశేనాపురం, ఓర్వకల్లు గ్రామాల విగ్రహాలను ఓర్వకల్లు గ్రామ సమీపాన ఉన్న కుందూ వాగులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సునీల్‌కుమార్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కురువ పెద్దయ్య, అబ్దుల్లా, అల్లాబాబు, వేణుగోపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మధు, రాము, నాగరాజు పాల్గొన్నారు.

నేడు సచివాలయ ఉద్యోగుల బదిలీకి కౌన్సెలింగ్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 10: నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు బుధవారం బదిలీలకు సంబంధించి ఫిజికల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో జరిగే కౌన్సిలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులను బట్టి అధికారులను నియమించారు. అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులకు రెవెన్యూ అధికారి జునైద్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు మేనేజర్ చిన్నరాముడు, వెల్ఫేర్ కార్యదర్శులకు టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ కార్యదర్శులకు మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, అమ్యూనిటీస్‌కు డీఈఈ డివి. క్రిష్ణలత, ప్లానింగ్ కార్యదర్శులకు డీసీపీ సంధ్యారాణి బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: రాజకీయ, విద్య, ఉద్యోగాలలో మాదిగలకు ప్రాధాన్యం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. మాదిగల కృతజ్ఞత యాత్రలో భాగంగా మంగళవారం కర్నూలు కలెక్టరేట్‌కు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 16న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞత యాత్ర చేపట్టామని తెలిపారు. గతంలో ఎస్సీ వర్గీకరణ చేసి సామాజిక న్యాయం పాటించింది చంద్రబాబే ఇప్పుడు వర్గీకరణ చేసేది కూడా ఆయనేనని కొనియాడారు. కార్యక్రమంలో నవీన్, రాముడు, జయన్న, ప్రకాష్ రాజ్, విజయుడు, వినోద్ పాల్గొన్నారు.

సరైన వేళలో బస్సులు నడపండి

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 10: కర్నూలు నుంచి గూడూరు మీదుగా సి.బెళగల్ రూట్‌లో సరైన వేళలో ఆర్టీసీ బస్సులను నడపాలని సి. బెళగల్ మండల ప్రయాణికులు కర్నూలు-2డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్‌ను కోరారు. మంగళవారం కర్నూలు-2డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల మధ్య ఆరు ఫిర్యాదు వచ్చినట్లు డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ తెలిపారు. గూడూరు మార్గంలో బస్సులు సమయవేళలు పాటించడం లేదని, చాలా ఆలస్యంగా వస్తున్నట్లు డీఎం దృష్టికి తీసుకొచ్చారు. వాటితోపాటు బస్సుల సంఖ్య కూడా ఈ రూటులో పెంచాలని కోరారు. దేవనూరు బస్సు సమయ వేళలో స్వల్పంగా మార్పు చేయాలని ప్రయాణికులు డీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని డీఎం వారికి సూచించారు.

19 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 10: నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎంఆర్‌సీ భవన్‌లో మండల నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి అసెంబ్లీ కోఆర్డినేటర్ పి. విజయకుమార్, మండల కోఆర్డినేటర్ ఎం. పుల్లన్న, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య, పీఈటీలు పరమేష్, గణపతి శ్రీనివాసులు, మల్లికార్జున, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, గంగాధర్, రాణమ్మ లోకేశ్ పాల్గొన్నారు.

ఐలమ్మ, రామకృష్ణ ఆశయాలను కొనసాగిద్దాం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 10: రైతాంగ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరుడైన సత్తెనపల్లె రామకృష్ణ ఆశయాలను కొనసాగించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. గురుశేఖర్ అన్నారు. మంగళవారం కార్మిక కర్షక భవన్‌లో చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణల వర్ధంతిలను పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ సేవలు మరువలేనివి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: హాస్టల్ వార్డెన్ కే.రాముడు పేద విద్యార్థులకు చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. మంగళవారం ఐటీసీ వద్ద ఉన్న శ్మశాన వాటికలో ఆయనకు బంధువులు, పూర్వ విద్యార్థుల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. శ్మశాన వాటికలో ఆయన ఫ్లెక్సీకి పూర్వ విద్యార్థులు, సహచర ఉద్యోగులు, బంధు వులు క్షీరాభిషేకం నిర్వహించారు.

నాటు సారా స్థావరాలపై సెబ్ దాడులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: నగరంలోని నాటు స్థావరాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం నగరంలోని బంగారు పేటలో సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. 3400 లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊట, 35 లీటర్ల నాటు సారాను గుర్తించామన్నారు. నీలి శికారీ పాతు నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈదాడుల్లో డీటీఎఫ్ సీఐ నరసానా యుడు, ఎస్ఐ మారుతీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 10: కోడుమూరు సెబ్ పోలీ సుస్టేషన్ పరిధిలోని కంబాలపాడు గ్రామంలో భారీగా కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. బుధవారం సీఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన జయరాముడు ఇంట్లో నిల్వ ఉంచిన 15 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశా మన్నారు. అలాగే మరో నిందితుడు ఎరుకల చెరువు గ్రామానికి చెందిన జయన్న పరారీలో ఉన్నాడని తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది అన్సార్ బాషా, శంకర్‌నాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

నగరానికి గణేశ్ నవరాత్రుల శోభ


మున్సిపల్ ఆఫీసులో కొలువుదీరిన గణనాథుడు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 10: నగరానికి గణేశ్ నవరాత్రుల ఉత్సవ శోభ కొట్టొచినట్లు కానవస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద భక్తుల సందడి పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉత్సవ కమిటీల నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో అల్పాహారం భక్తులకు వితరణ చేస్తున్నారు. ఈ ఏడాది నగరంలో సుమారు 2వేల వరకు విగ్రహాలను నెలకొల్పారు. నగర పాలక సంస్థలో 'నగరపాలక గణపతి' ఏర్పాటు చేశారు. కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ఏటా నిమజ్జనం రోజున పరిపాలన గణపతికి పూజలు చేసి, నిమజ్జనాన్ని ప్రారంభిస్తారు. అలాగే పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి తొలి పూజలు నిర్వహిస్తారు. వెంకటరమణ కాలనీలోని రామ లింగేశ్వర నగర్ పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి మండపానికి తిరుమల శ్రీవారి మందిరం తరహాలో ఏడు ద్వారాలు ఏర్పాటు చేశారు. ప్రకాశ్‌నగర్‌లో సాగరమథన గణపతి మూర్తి భక్తులను ఆకట్టుకుంటోంది. గణేశ్ నగర్, బి.క్యాంపు, బిర్లాగేటు, నంద్యాల చెక్‌పోస్టు, టెలికాంనగర్, అబ్బాస్ నగర్, సి.క్యాంపు, మద్దూరు నగర్, బుధవారపేట, బంగారుపేట, అశోక్‌నగర్, శ్రీనివాస నగర్, సంకల్ బాగ్, ఎన్ఆర్ పేట, కొత్తపేట, నరసింహారెడ్డినగర్, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో భారీ విగ్రహాలను నెలకొల్పారు.


ప్రకాశ్‌నగర్‌లో..


ఎన్ఆర్ పేటలో..


వెంకటరమణ కాలనీలో..


అశోక్‌నగర్‌లో..

వరద బాధితులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే కోట్ల


మాట్లాడుతున్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

కోడుమూరు, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వరద బాధితులకు మధు సిమెంటు అధినేత ఎద్దుల మహేశ్వరరెడ్డి రూ.లక్ష విరాళంగా కోట్లకు అందించారు. అలాగే పట్టణంలోని సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్మికులు కలిసి రూ.60,116 అందించారు. కాంట్రాక్టర్ మహేశ్వరరెడ్డి రూ.50వేలు, కేపీఎస్ఆర్ కళాశాల అధినేత రామసుబ్బారెడ్డి రూ.50వేలు, చిన్న మసీదు ముస్లింలు రూ.35,500, రియల్ ఎస్టేట్ యూనియన్ నుంచి రూ.35వేలు, డాక్యుమెంట్ రైటర్స్ రూ.24వేలు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు మధు సూదన్‌రెడ్డి రూ.20వేలు, కూరగాయల మార్కెట్ వ్యాపారి రవికుమార్ రూ.20వేలు నగదును అందించారు. కేవీఆర్ కళాశాల యాజమాన్యం రూ.13,500, అలాగే కల్లు డిపో అసోసియేషన్, వస్త్ర దుకాణం అసోసియేషన్ రూ.15వేలు, స్వర్ణకారుల సంఘం ట్రాక్టర్ అసోసియేషన్ రూ.12 వేల నగదును అందించారు. సబ్‌రిజిస్ట్రార్ మహబూబ్‌బాషా, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, ఎస్‌జీ శంకర్‌బాబు, వార్డు నంబర్ షఫి, మెడికల్ స్టోర్, కిరాణం అసోసియేషన్ రూ.10వేల చొప్పున నగదును అందించారు. సుమారు రూ.6లక్షల వరకు విరాళాలు అందించడంపై కోట్ల అభినందించారు. గూడూరు, సి.బెళగల్ మండలాల్లో కూడా విరాళాలు సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు నగదును అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, మాజీ సర్పం చు కేశ రాంబాబు, సీబీలత, ఎమ్మార్పీఎస్ ఆంధ్రయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీ

గొల్లపూడిలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


మంత్రి నాదెండ్లతో కలిసి నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 10: విజయవాడ వరద ముంపు ప్రాంతమైన గొల్లపూడిలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పాల్గొని బాధితులకు నిత్యావసర కిట్లు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గొల్లపూడి ఇన్‌చార్జిగా నియమితులైన గౌరు చరిత మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అనంతరం వారు వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. త్వరలో విజయవాడ వరద ముంపును నుంచి శాశ్వత పరిష్కారం దిశగా సీఎం చంద్రబాబు చర్యలు చేపడుతున్నట్లు గౌరు చరిత తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి


మంత్రి ఫరూక్‌తో చర్చిస్తున్న ఎంఏ గఫూర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 10: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర వ్యవస్థాపకుడు ఎంఏ గఫూర్ అన్నారు. మంగళవారం నగరానికి విచ్చేసిన రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ప్రభుత్వ అతిథి గృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ బిల్లుతో ముస్లింలకు వక్ఫ్ ఆస్తులపై ఎలాంటి హక్కులు లేకుండా చేస్తుందన్నారు. దర్గాలు, మసీదులు, పీర్ల సావిడి తదితర వాటిపై వార సులకు ఎలాంటి హక్కులు లేకుండా చేయడమే సవరణ బిల్లు ఉద్దేశ మన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు నాసిర్ అహ్మద్, నగర కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.

● నగరంలోని బుడంఖాన్ మసీదు స్థలాన్ని కాపాడాలని కోరుతూ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు మసీదు కమిటీ సభ్యులు వినతి పత్రం అం దజేశారు. కార్యక్రమంలో చోటుభాయ్, షరీఫ్ ఉన్నారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 10: స్వచ్ఛ ఆంధ్రా క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి రఘుశేఖర్, విజయరామాంజనేయులు పాల్గొన్నారు.

డోలమైట్ పౌడర్ లారీ సీజ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 10: డోలమైట్ పౌడర్‌ను డోన్ నుంచి బెంగుళూరు అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఉదయం డోన్ పట్టణ శివారులో వాహనాల తనిఖీల్లో లారీని పరిశీలించగా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిందని తెలిపారు. లారీని సీజ్ చేసి డోన్ పోలీస్టేషన్ తరలించామని, ఈ దాడుల్లో టెక్నికల్ అసిస్టెంట్ బాలునాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

కల్లూరు, సెప్టెంబరు 10: కల్లూరు మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను కల్లూరు వ్యవ సాయ అధికారి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మంగళవారం పందిపాడులో ఆయన పర్యటించి పొగాకు, పత్తి, కంది, కొర్ర , ఉల్లిగడ్డ పంటలను పరిశీలించారు. ఆయన వెంట కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూరపాటి దేవేంద్రారెడ్డి, గూడూరు శేఖర్ చౌదరి, కే.భీమ్మడు, మహేశ్వరరెడ్డి, పురుషోత్తం, శివ, చిన్న లక్ష్మన్న ఉన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

కల్లూరు, సెప్టెంబరు 10: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మం డల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, వెలుగు ఏపీఎం, ఈఓఆర్డీతో ఆయన సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం శ్రీనివాసగౌడ్, ఈఓఆర్డీ రవికిషోర్, హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ పాల్గొన్నారు.

'క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడొద్దు'



మాట్లాడుతున్న డాక్టర్ బి.రమేష్‌బాబు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: యువత క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడొద్దని మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బి.రమేష్ బాబు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కర్నూలులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి సమస్యను పరిష్కారం ఉంటుందని, పెద్ద సమస్య ఏదైనా వచ్చిన వెంటనే తోటి మిత్రులు, కుటుంబీకులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐఏయూవైఎస్ఏ సంస్థ జిల్లా ప్రతినిధులు హుశేన్‌బాషా, సభ్యులు బుద్ధిరాజ్, విశ్వనాథ్, సూర్య తేజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది: ప్రిన్సిపాల్

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కేఎంసీ న్యూలెక్చరర్ గ్యాలరీలో సైక్రియాట్రి హెచ్‌వోడీ డా.నాగేశ్వరరావు అధ్యక్షతన ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికా కుండా కొంత సమయం తీసుకోవాలన్నారు. మానసిక వైద్య విభాగం హెచ్‌వోడీ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిడిని ఎదుర్కొవడానికి రోజువారి జీవితంలో యోగా, మెడిటేషన్ ఒక భాగం చేసుకోవాలన్నారు. అనంతరం కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఆత్మహత్య నివారణపై నాటి కలు, రీల్స్ ప్రదర్శించారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకే రెగ్యులర్ పోస్టులు ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: రెగ్యులర్ స్టాఫ్ నర్సుల పోస్టులను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకే ఇవ్వాలని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు డి.మంజులాదేవి డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఓల్డ్ సీఎల్‌జీ నుంచి సర్జరీ, ఎంసీహెచ్ మీదుగా క్యాజువాల్టీ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేశారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల ఆందోళనకు ఏపీజీడీఏ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు డా. రామకృష్ణ నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ విమలమ్మ సంఘీభావం ప్రకటించారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన: జీవో నెంబరు 85కి వ్యతిరేకంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం ఏపీ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 35 పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు.

స్వచ్ఛమైన గాలిని అందించాలి: స్వచ్ఛమైన గాలిని ప్రజలకు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం సందర్భంగా ఆయన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఇటీవల కాలంలో రోజు రోజుకు వాతావరణ కాలుష్యం పెరిగి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, డీపీఎంవో డాక్టర్ సంధ్య, డెమో శ్రీనివాసులు, డీపీహెచ్‌ఎన్‌వో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి వంద ఫ్యాన్లు విరాళం

ముందుకొచ్చిన అల్యూమి, రెడ్‌క్రాస్ సొసైటీలు



ఫ్యాన్లను అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 10: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స కోసం వచ్చే రోగుల కోసం కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వంద సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా అందించింది. ఈ మేరకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం మధ్యాహ్నం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డికి అందిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాతలు ఇచ్చిన ఫ్యాన్లను వార్డు లు, కామన్ వెయిటింగ్ హాల్‌లో రోగులు విశ్రాంతి సమయంలో దోమల బెడద లేకుండా వీటిని ఉపయోగించా లన్నారు. కార్యక్రమంలో కేఎంసీ పూర్వ విద్యా ర్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా.కుమారస్వామి రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిత్తడే

» స్విమ్మింగ్‌పూల్‌ను తలపిస్తున్న జి.శింగవరం రోడ్డు
» గుంతలమయంగా రేమట-ఉల్చాల రహదారి


రేమట-ఉల్చాల ప్రధాన రహదారి దుస్థితి

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 10: గత కొద్ది రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మరికొన్ని రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గ్రామీణ ప్రాంతాల రహదారి నిర్మాణాలకు తట్టెడు మట్టి కూడా వేయలేదు. కర్నూలు రూరల్ మండలంలో ఉన్న జి. శింగవరం మీదుగా కర్నూలు-సుంకేసులకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. జి.శింగవరం గ్రామ నడిబొడ్డున ఉన్న ఈ ప్రధాన రహదారి స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తోంది. అనేక సార్లు వాహనదారులు ద్విచక్ర వాహనాలు సైతం అదుపు తప్పి కింద పడి గాయపడ్డారు. అంతేకాకుండా రేమట- కొత్తకోటతోపాటు ఉల్చాల-రేమట మధ్య ప్రధాన రహదారులు ఇదే కోవలో ఉన్నాయి. గ్రామీణ ప్రజలు ఎన్నోసార్లు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళిన ప్రయోజనం లేదు. కనీసం టీడీపీ ప్రభుత్వంలోనైన ప్రధాన రహదారులను మెరుగు పరచాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.


జి.శింగవరంలో స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్న ప్రధాన రహదారి

బ్యాంకర్లు పేదలకు అండగా నిలవాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: అవసరాల్లో ఉన్న పేదలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసి అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లకు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటి (డీసీసీ) సమావేశం జరిగింది. బ్యాంకుల ద్వారా పలు ప్రభుత్వ పథకాల నుంచి లభించే సబ్సిడీ రుణాల మంజూరు పూర్తి వివరాలతో గురించి బుక్‌లెట్ తయారు చేసి గ్రామాల్లో ఉండే ప్రజలకు అందించే విదంగా చర్యలు తీసుకోవాలని ఎల్డీఎంను ఆదేశించారు. కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ముఖ్యపాత్ర పోషించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే యువత స్టాండ్ అప్ ఇండియా స్కీమ్ కింద రుణాల మంజూరుపై దృష్టి పెట్టాలని అన్నారు. సమావేశంలో జేసీ నవ్య, ఎల్డీఎం రామచంద్రరావు, అధికారులు, పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 10: జిల్లా కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సీఎం సహాయ నిధికి విరాళంగా కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ తరపున రూ.5లక్షలు, 43 సహకార సంఘాల తరపున రూ.4.30లక్షల చెక్కును కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యలకు అందజేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీవో పాల్గొన్నారు.

రాయితీతో డ్రిప్ పరికాలు

మద్దికెర, సెప్టెంబరు 10: పడ్ల తోటల రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తామని ఏపీవో నర్సిరెడ్డి మంగళవారం అన్నారు. ఐదెకరాల్లోపు పొలం ఉంటే 90శాతం, పదెకరాల్లోపు 70శాతం, పన్నెండెరాలు ఉంటే 45శాతం రాయితీ వస్తుందని అన్నారు. ఇందుకు రైతులు ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో కోరారు.

పౌష్టికాహారం తప్పక ఇవ్వాలి

మద్దికెర, సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార సదస్సులను నిర్వహించారు. పాలు, గుడ్లు, బాలామృతం, బాల సంజీవనిలు అందించాలన్నారు. బాలబాలికలు, మహిళలు రక్తహీనతకు గురి కాకుండా ఇది ఉపయోగపడుతుందని అన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి


తుగ్గలి, సెప్టెంబరు 10: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కొండారెడ్డి, సీపీఎం కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం జొన్నగిరిలోని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం చేయాలని, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని కోరారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి


రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవనకొండ, సెప్టెంబరు 10: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం దేవనకొండలో రాస్తారోకో నిర్వహించారు. ఆటో వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాఘవేంద్ర, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు ఎం.నరసారావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి ఆశ్రయం


వృద్ధుడితో ఫిలిప్

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 10: ఆశ్రమం ముందు వదిలి వెళ్లన గుర్తుతెలియని వృద్ధుడిని జీవనజ్యోతి ఆశ్రమ నిర్వాకుడు పాస్టర్ విక్టర్ పాల్‌ఫిలిప్ అక్కున చేర్చుకున్నారు. వృద్ధుడి వయస్సు 70 ఏళ్లు ఉండవచ్చునని ఇక్కడికి ఎలా వచ్చానో తెలియదన్నారు. అనాథలు ఉంటే తనను 9441400457 నంబర్లో సంప్రదించాలని ఫిలిప్ కోరారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

హాలహర్వి, సెప్టెంబరు 10 : వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం హాలహర్విలో మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, అబద్ధపు హామీలతో గద్దెనెక్కారని ఇప్పటికీ రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కార్యదర్శి జనార్దన్ నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు నోటీసులు

ఆలూరు, సెప్టెంబరు 10: పాత బస్టాండ్‌లో వీధి వ్యాపారులకు గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. బస్టాండ్‌లో బస్సులు నిలిపేందుకు ఇబ్బందిగా ఉందని. జాతీయ రహదారి కావడంతో వాహనాలు అదుపు తప్పితే ప్రమాదాలు చోటుచేసుకుంఆయని వెంటనే ఖాళా చేయాలని కోరారు. దీంతో వ్యాపారులు టీడీపీనేత వీరభద్ర గౌడ్‌ను కలవగా, ఆయన జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకోనే అవకాశముందని, సంత మార్కెట్‌లోకి వెళ్లాలని ఆయన నచ్చజెప్పారు.

స్వర్ణ కవచ సమర్పణ సేవ


బంగారు అలంకరణ

మంత్రాలయం, సెప్టెంబరు 10: వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ చేశారు.. మంగళవారం సప్తమి పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు. పీఠాధిపతి మహ మంగళ హారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించారు.

రహదారికి మరమ్మతులు

నందవరం, సెప్టెంబరు 10: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచన మేరకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ దేశాయి మాధవరావు ఆధ్వర్యంలో రహదారులకు మరమ్మతులు నిర్వహించారు. దేశాయి మాట్లాడుతూ ముగతి నుంచి కనకవీడు వరకు నూతన రహదారికి ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారని, త్వరలో పనులు చేపడతారన్నారు. ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లి పాల్గొన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను పరిశీలించారు.

పాము కాటుతో రైతు మృతి


దేవిరెడ్డి(ఫైల్)

మంత్రాలయం, సెప్టెంబరు 10: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన రైతు దేవిరెడ్డి(61) పాము కాటుతో మృతి చెందాడు. బంధువులు, గ్రామస్థులు తెలిపిన మేరకు మంగళవారం పొలంలో కూలీలతో కలిసి పని చేస్తుండగా.. దేవిరెడ్డిపై పాము కాటువేసింది. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి అనంతరం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య రామలింగమ్మ, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జీవో 85ను రద్దు చేయాలి

ఆస్పరి, సెప్టెంబరు 10: ప్రభుత్వం జీవో 85ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులలో పాల్గొన్నారు. ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు రఘురాం రెడ్డి, అరుణ్ మాట్లాడుతూ జీవోతో తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

తుగ్గలి: తుగ్గలి, పగిడిరాయి ప్రాథమిక వైద్యశాలలో వైద్యులు, నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అనంతరం నిరసన తెలిపారు. రెండు నెలల నుంచి ఉన్నతాధికారులను, శాసనసభ్యులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పీజీ అవకాశాలు తగ్గించారని, గ్రామాల్లో సేవలు అందించే వైద్యులు కరువవుతారని అన్నారు.

భద్రత డొల్ల!


ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీలో తరచూ దొంగతనాలు

రైతులు, వ్యాపారుల ఆందోళన

34 కెమెరాలు ఉండగా, పనిచేసేది కొన్నే


ధ్వంసమైన దుకాణం-42 షట్టర్(ఫైల్)

ఎమ్మిగనూరు, సెప్టెంబరు10: వ్యవసాయ మార్కెట్‌లో ఏటా రూ. 200 కోట్ల వ్యాపారాలు నిర్వహిస్తుండగా కమిటీకి రూ.6కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఏటా దాదాపు 4లక్షలకు పైగా వేరుశనగ, ఆముదాలు, పొద్దుతిరుగుడు, కందులు, మినుములు, మొక్కజొన్న పంట ఉత్పత్తుల బస్తాలు క్రయ విక్రయానికి వస్తుంటాయి. ఇలాంటి మార్కెట్ కమిటిలో తరచూ చోరీ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైతులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు, వ్యాపారుల ఆందోళన

కమిటిలో 86 కమీషన్ ఏజంట్ల దుకాణాలు ఉండగా వీరిలో 36 మందికి వ్యాపారం చేస్తున్నారు. లావాదేవీలు జరుపుతున్నారు. అలాగే 15మంది వ్యాపారులు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంటారు. ఏడాదిలో రూ. 200కోట్ల లావాదేవీలు ఉండగా, రూ.6 కోట్ల ఆదాయం సమ కూరుతోంది. ఇంత భారీ ఆదాయం ఉన్నా తరచూ చోరీలు చోటు చేసుకుంటుండటం వ్యాపారులను, కమీషన్ ఏజంట్లను ఆందోళనకు గురిచేసోంది.

సీసీ కెమెరాలున్నా..

మార్కెట్ ఆవ ణలో 34 సీసీ కెమెరాలు ఉండగా ఇందులో మొన్నటి వరకు అరకొరగా పనిచేసేవి. వారం రోజుల క్రితం జేడీ రామాంజనేయులు వీటిని పరిశీలించి, వెంటనే బాగుచేయించాలని ఆదేశించారు. అంతేగాక ఇటీవల మార్కెట్‌లో ఓ వ్యాపారి దుకాణం షట్టర్‌ను దుండగులు పగలగొట్టి ధ్వంసం చేశారు. మేల్కొన్న అధికారులు 25 కెమెరాలను బాగు చేయించారు. మిగతావి అలాగే ఉన్నాయి. కేవలం 13మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండటంతో సరిపోవడం లేదు.

గస్తీ పెంచాం

మార్కెట్‌లో గస్తీ పెంచాం, రాత్రిళ్లు నలుగురు సెక్యూరిటీ గార్డులను కాపలా ఉంచాము. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షణ చేస్తున్నారు. 34 సీసీ కెమెరాలు ఉండగా 25 పనిచేస్తున్నాయి, మిగతావాటిని త్వరలో బాగుచేయిస్తాం, దొంగతనాలను నివారిస్తాం. **- పద్మావతి, కార్యదర్శి**

పీఠాధిపతికి తులాభారం

మంత్రాలయం, సెప్టెంబరు 10: మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు వినాయక మిత్ర మండలి సభ్యులు తులాభారం వేశారు. మంగళవారం రాత్రి బెల్లం, కలకండ, జీడిపప్పు, బాదం వంటి వాటితో తులాభారం చేశారు. మేనేజర్ ఎస్‌కే శ్రీనివా సరావు, శ్రీపతాచార్, జనార్దన్ రెడ్డి, సోమశ్వరరెడ్డి, బసవ రాజు, శశికాంత్ శెట్టి, రవిస్వామి, వెంకటేశ్‌శెట్టి, పాండు రంగయ్య శెట్టి, విశ్వనాథ్, ఉమేషాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, ప్రకాష్, అమ్రేష్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు

మాజీ మంత్రి కొడాలి నానిపై ఫిర్యాదు

ఆలూరు, సెప్టెంబరు 10: సీఎం చంద్రబాబుపై త్రీవ వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కొడాలి నానిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్ సెల్ ఆలూరు కన్వీనర్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.. మంగళవారం ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సీఎంను మీడియా సమావేశంలో దుర్భాషలాడటం సరి కాదన్నారు. వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు. వెంకటేష్ చౌదరి, షేక్షవల్లి, హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 10: మున్సిపల్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రాజా సతీష్ అవార్డును అందుకున్నారు. మంగళవారం సహ ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం మల్లికార్జున, ఫయాజుద్దీన్, నాగరాజు, గిరిబాబు, నిరంజన్ పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి


బైచిగేరిలో పొలాలను పరిశీలిస్తున్న గిడ్డయ్య

ఆదోని రూరల్, సెప్టెంబరు 10 : భారీ వర్షాలను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బైచిగేరి గ్రామంలో పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.40వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని అన్నారు. రుణాలను రద్దు చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని, లేనిపక్షంలో సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్రయ్య, నాయకులు జగన్నాథం, పంపన్నగౌడు, లక్ష్మిరెడ్డి, సుదర్శన్, కల్లుబావి రాజు, ఈరన్న, రామన్న, హనుమంతు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు కోసమే కులాల మధ్య చిచ్చు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, సెప్టెంబరు 10: ఓటు బ్యాంకు కోసమే మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కులాలను విభజించి పాలించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆరోపించారు. మంగళవారం వీఎస్‌పీ ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యలు సృష్టించి, పరిష్కరించి పేరు తెచ్చుకోవడం ఆయన నైజమన్నారు. ఎల్లెల్సీలో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 400పై విగ్రహాలను ఉదయం 8:30 నుంచే నిమజ్జం చేయాలని, సాయంత్రంలోగా పూర్తి చేయాలని కోరారు. నిమజ్జనానికి చిన్నారు లను తీసుకెళ్లరాదని సూచించారు. బీజేపీ నాయకులు విట్ట రమేష్, నాగరాజు గౌడ్, ఉపేంద్ర, చెన్న బాసప్ప, సాయి పాల్గొన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి


మాట్లడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, సెప్టెంబరు 10: యువత అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. పత్తికొండ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రతి ఒక్కరూ ఆశిస్తారని అయితే ప్రైవేటీకరణతో కార్పొరేట్ కంపెనీలలో మంచి అవకాశాలు అందుబాటులో ఉంటున్నాయన్నారు. జిల్లా నైపుణ్యాభి వృద్ధిశాఖ వారితో మాట్లాడి ఈజాబ్‌మేళాను ఏర్పాటు చేశామని అన్నారు. మూడునెళ్లకోసారి జాబ్‌మేళాను నిర్వహిస్తామని అన్నారు. నైపుణ్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధురి, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, బత్తినివెంకట్రాముడు, రామానాయుడు, తిమ్మయ్య చౌదరి పాల్గొన్నారు.

41మంది ఉద్యోగాలకు ఎంపిక

95 మంది దరఖాస్తుచేసుకోగా 41 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కంటివైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

3వ సచివాలయంలో నంద్యాల శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కేఈ శ్యాంబాబు సందర్శించారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరు సాగిద్దాం


ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 10: తెలంగాణ పోరాటంలో దొరలు, రజాకారులను గడగడలాడించిన వీరనారి కామ్రేడ్ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, చేతి వృత్తుల సంఘం కార్యదర్శి కారన్న పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. భూమి కోసం, ముక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. రజక సంఘం నాయకులు పందికోన హనుమేష్, పెద్దహుల్తి వీరేష్, సీపీఐ కార్యదర్శి రాజాసాహేబ్, ప్రజా సంఘాల నాయకులు వెంకట్రామిరెడ్డి, రంగన్న, గురుదాస్, సిద్దు, నాగరాజు, లక్ష్మికాంతరెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితుల విరాళాలు ఎమ్మెల్యేకు అందజేత


వాహనంతో టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్

తుగ్గలి, సెప్టెంబరు 10: మండలంలో సేకరించిన వరద బాధితుల విరాళాలను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు మంగళవారం అందజేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, సీనియర్ నాయకులు వెంకటస్వామి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, యువ నాయకుడు మిద్దె వెంకటేశ్ యాదవ్ మండలం నుంచి రూ.9 లక్షలకు పైగా విరాళాలు సేకరించామన్నారు. మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్, శివరాముడు చౌదరి, బాదడ కౌశిక్‌కుమార్, వెంకట్రాముడు చౌదరి, మల్లి తదితరులు ఉన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం

ఆదోని (అగ్రికల్చర్): వరద బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విరాళాలను సేకరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సూరి, కార్యదర్శి గౌస్, నాయకులు నాగరాజు, శశిధర్, యశ్వంత్, విశ్వనాథ్, మోమిన్, భాష పాల్గొన్నారు.

గోనెగండ్ల: వరద బాధితులకు గోనెగండ్ల మండల టీడీపీ నాయకులు విరాళాలను అందజేసినట్లు పార్టీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు తెలిపారు. మండలం నుంచి ఒక్క రోజులో రూ. 1.67 లక్షలను సేకరించామని తెలిపారు. వీటిని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి జమ చేస్తామని అన్నారు.

మద్దికెర:

మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన దాత పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న) కుటుంబీకులు రూ.లక్ష, అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రూ.1,91,100లు మొత్తం రూ 2,91,100లను ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

మెడికల్ తిమ్మప్ప, నరేంద్ర, ఎర్రిస్వామి, రామాంజులు, నారాయణ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల తరలింపు

ఆదోని: విజయవాడ వరద బాధితులకు వాసులకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు నిత్యవసర సరుకుల వాహనాన్ని జండా ఊపి విజయవాడకు పంపించారు. బత్తిన కుబేర్నాథ్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ దేవేంద్రప్ప, శ్రీనివాస ఆచారి, రంగన్న, తిమ్మప్ప ఉన్నారు.

ఆదోని టౌన్: పట్టణంలోని ప్రియదర్శిని కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్, మజీ ఎమ్ఎల్‌సీ బీ చంద్రశేఖర్ రెడ్డి సీయం రిలీఫ్ పండ్‌కు తమ బ్యాంక్ తరపున రూ.లక్ష రూపాయల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే పార్థసారథికు అందజేశారు. సిబ్బంది ఒక రోజు వేతనం రూ.10,500లను తమ వంతు విరాళంగా అందజేశారు.

పెద్ద హరివాణంలోని మ్యూచుయల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ తరఫున వరద బాధితుల కోసం సీయం రిలీఫ్ ఫండ్‌కు మంగళవారం సొసైటీ అధ్యక్షుడు హెచ్ ఆదినారాయణ, రూ.పది వేలను ఎమ్మెల్యే డా. పార్థసారథికు అందజేశారు.

ఆలూరు: వరద బాధితుల సహాయార్థంతో రూ.750విలువ గల 1500 నిత్యావసర వస్తువుల కిట్లను మంగళవారం ప్రత్యేక వాహనంలో వీరభద్ర గౌడ్ తరలించారు.. టీడీపీ కార్యకర్తలు, నాయకులు అక్కడికి వెళ్లి బాధితులకు కిట్లు అందజేస్తారని ఆయన తెలిపారు..

నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 10: గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఆర్ట్స్ కాలేజ్, తిక్కస్వామి దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, బీమా సర్కిల్, పరిసా మోహల్ల, శ్రీనివాస్ భవన్, ఎల్బీ స్ట్రీట్, న్యూ ప్లైఓవర్, వినాయక ఘాట్ దారులను పరిశీలించారు. విగ్రహాల ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. రహదారిపై ప్యాచ్ వర్క్‌ను త్వరగా ముగించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. క్రేన్లను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. డీఎస్పీ సోమన్న, తాహసీల్దార్ శివరాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సీఐ సూర్య మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

పట్టాలివ్వండి..

ఆదోని రూరల్: తాము 30 సంవత్సరాలుగా కొట్టాలు వేసుకున్నామని తమకు పట్టాలు ఇవ్వాలని 300 కుటుంబాల వారు సబ్ కలెక్టర్‌ను కోరారు. 104 బసాపురంలో సబ్ కలెక్టర్‌మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ శివరాముడుతో కలిసి పర్యటించారు. స్పందించిన సబ్ కలెక్టర్ అది ప్రభుత్వ భూమి కాదని తమదని, కోర్టులో ఉందని విచారణ చేసి ముందుకెళ్తామని సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


టమోటా పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 10: వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ శివారులోని పొలాలను పరిశీలించారు. రైతు లక్ష్మన్న పొలంలో దెబ్బతిన్న టమోటాను పరిశీలించి నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎడతెరపి లేని వర్షాలతో పరివాహక ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.40వేలు, వేరుశనగ, కంది, జొన్న తదితర పంటలకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి రాజా సాహేబ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, నియోజక వర్గ అధ్యక్ష కార్యదర్శులు ఈరన్న, ఉమాపతి, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, కాశీ, నాగిరెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పంపన్నగౌడులు పరిశీలించారు. రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పంటల పరిశీలన జీపుజాతా మంగళవారం ఎమ్మిగనూరుకు వచ్చింది. తిమ్మయ్య, బీటీ చినన్న, కేసీ జబ్బార్, మాలిక్, శాంతప్ప, హనుమంతు, రాము, జయన్న, ఇస్మాయిల్, సీపీఐ నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్, సోమేశ్వరరెడ్డి, దాదావలి, రాజీవ్ లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 10: ఎన్నో పోరాటాలు, త్యాగాలతో రక్తం చిందించి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను ఆపాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజాసాహేబ్, ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్యలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు సంఘాల రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా మంగళవారం పత్తికొండలో ఏఐకేఎస్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల కూడలి వద్ద విశాఖ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం లాభాల బాట నడుస్తున్న పరిశ్రమలను ప్రైవేటుపరం చేసి కార్మికుల పొట్ట కొట్టేందుకు సంస్కరణలు తీసుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు. లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు సాగిస్తుందన్నారు. ఏఐటీయుసీ నాయకులు రంగన్న, నెట్టికంటయ్య, రైతు సంఘం నాయకులు కారన్న, వెంకట్రామిరెడ్డి, రాజప్ప, నాగరాజు, ఉచ్చన్న పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి - ఏడీఏ

గోనెగండ్ల, సెప్టెంబరు 10: గులాబీ పురుగు, రసం పీల్చే పురుగు పట్ల పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని హెచ్ కైరవాడి, తిప్పనూరు, వీరంపల్లి, పుట్టపాశం గ్రామాలలోని పంటలను పరిశీలించారు. వర్షాలు, ముసురు కమ్ముకోవడంతో పత్తికి గులాబీ పురుగు, రసం పీల్చే పురుగు, ఎర్రతెగులు, దోమ పోటు, సోకిందన్నారు. దీంతో పత్తిలో గుడ్డి పువ్వులు వస్తున్నాయని తెలిపారు. పంట సాగు చేసిన 45 రోజుల నుంచే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పూత మొగ్గదశలో ఉన్నప్పుడు వేపనూనే లీటర్ నీటిలో ఐదు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. క్లోరిఫైరిపాస్, లేదా క్వినాల్‌పాస్ ప్రొఫినోపాస్ 2మిల్లిలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే గుడ్డి పూలు, రాలిన గూడ, పూత, పిందెలను వేరుచేసి నాశనం చేయాలన్నారు. పంటను 150 నుంచి 160 రోజులకు మించి ఉంచరాదన్నారు. రెండు మూడు ఏళ్లకోసారి పంట మార్పిడి చేయాలని సూచించారు. ఈకేవైసీ చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు.

రహదారుల గుంతల పూడ్చివేత

గోనెగండ్ల, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో గుంతలు పడ్డ రహదారులకు మట్టివేసి పూడ్చినట్లు సర్పంచ్ హైమావతి తెలిపారు. చింతలాముని నల్లారెడ్డి దశమి ఉత్సవం సందర్భంగా గుంతలు పడిన రోడ్లకు మర్మతులు చేశామన్నారు. అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నూర, జిలాని, రంగస్వామి, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ప్రమాదంలో వృద్ధుడి మృతి

వెల్దుర్తి, సెప్టెంబరు 10: మండలంలో సూదేపల్లెలో సోమవారం నిమజ్జనం సందర్భంగా వృద్ధుడు మాల మాదన్న(74) చెరువులో మృతిచెందాడు. వినాయకుడిని నిమజ్జనం చేయడానికి మాదన్న కూడా వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి గాలించగా చివరికి చెరువులో మాదన్న మృతదేహం తేలియాడుతూ కనిపించింది.

రోడ్డుపై ఆవులు.. చోదకుల అవస్థలు


కల్లుబావి ప్రాంతంలో అర్ధరాత్రి నడిరోడ్డుపైనే ఆవులు

ఇప్పటికే నోటీసులు ఇచ్చాం.



పశువుల యజమానులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు ఇచ్చాం. మరోసారి ఇచ్చి, స్పందించకుంటే రహదారిపై ఉండే పశువులను గోశాలకు తరలిస్తాం.

- అనుపమ, ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్

ఆదోని, సెప్టెంబరు 10: పట్టణంలోని ప్రధాన రహదారులపై రాత్రిళ్లు ఆవులు తిష్ట వేస్తున్నాయి. వందల సంఖ్యలో రోడ్డుపై అడ్డంగా పడుకుంటుండటంతో వాహచన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమ్రాతం అదుపు తప్పినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. పట్టణ శివారు ప్రాంతాల్లో కాదు పట్టణంలోని ప్రధాన కూడళ్లు ఆర్టీసీ బస్టాండ్, చందాసాబ్ దర్గా, ఆర్ట్స్ కాలేజ్, శంకర్ నగర్, కల్లుబావి, తిమ్మారెడ్డి బస్టాండ్, శ్రీనివాస్ భవన్, భీమాస్ సర్కిల్‌ల వద్ద రహదారులపై తిష్ట వేస్తున్నాయి.

కొరవడిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ

ఆవులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రమాదాలు సంభవించి చోదకులు గాయపడ్డారని, ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

యజమానులు ఎవరు?

అసలు ఈ పశువులకు యజమానులు ఎవరో తెలియడం లేదని స్థానికులు అంటున్నారు. తోపుడు బండ్లపై ఉండే పండ్లు, కూరగాయలను తిసివేస్తున్నాయని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.